క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చరణ్‌రెడ్డి


రేవంత్‌రెడ్డితో రాంరెడ్డి చరణ్‌రెడ్డి

కామేపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గంగమ్మకు మొక్కు చెల్లింపు

రఘునాథపాలెం: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు విజయం సాధించిన నేపథ్యాన రఘునాథపాలెం కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని గంగమ్మ తల్లి గుడి వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి గురువారం మొక్కు చెల్లించారు. తుమ్మల నామినేషన్ తర్వాతస్థానిక గంగమ్మ తల్లి వద్ద పూజలు చేశాక ప్రచారం ఆరంభించారు. అనుకున్నట్లుగానే ఆయన విజయం సాధించడంతో మొక్కు చెల్లించినట్లు రఘునాథపాలెం కాంగ్రెస్ అధ్యక్షుడు మందా బుచ్చిబాబు తెలిపారు. నాయకులు జాలాది శ్రీను, తక్కెలపాటి భద్రయ్య, తాత రఘురాం, బోయిన వెంకటనర్సయ్య, రెంటల ప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో మేయర్ కుటుంబం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, రాంబ్రహ్మం దంపతులు గురువారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ముచ్చర్ల కాంప్లెక్స్ కమిటీ ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కామేపల్లి: టీఎస్ యూటీఎఫ్ ముచ్చర్ల కాంప్లెక్స్ నూతన కమిటీని అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్వరస్వామి, కో కన్వీనర్‌గా భుక్యా సుమన్, సెక్రటరీగా దారెల్లి వెంకయ్యలను ఎన్నుకుని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ నేపథ్యాన పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, వెంకటనరసయ్య, సైదా, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖమ్మంఅర్బన్: బోనకల్ రోడ్డులోని శ్రీరాం హిల్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరి రమేశ్‌బాబు అనే ప్రైవేట్ ఉద్యోగికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో అతడి భార్య శిల్ప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఖమ్మంఅర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఏడాది అక్టోబర్ 15వ తేదీన రమేశ్‌బాబు బోనకల్ వెళ్లి తిరిగి వస్తుండగా.. రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాగా, ఫిర్యాదులో జాప్యం జరిగినట్లు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	పిండం, జోరుగా హుషారుగా
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్ట్రాడినరీ మ్యాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	76		10
బెండకాయ	70	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	60	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	66	తోటకూర	3
దొండ	70		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	70	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

వరి కోతలు షురూ..



వరి పంటను నూర్పిడి చేస్తున్న హార్వెస్టర్ (ఇన్‌సెట్) ధాన్యాన్ని రాశిగా పోస్తూ.. ఇలా

హార్వెస్టర్ల సాయంతో కోయిస్తున్న రైతాంగం

- తక్కువ ఖర్చుతో పాటు సమయం ఆదా
- గంటల వ్యవధిలోనే కోతలు పూర్తి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కామేపల్లి: మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరమయ్యాయి. ఆరు నెలలు శ్రమించిన రైతు కష్టం పంట రూపంలో చేతికి అందుతోంది. మరో రెండు, మూడు వారాల్లో దాదాపు వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. మండలంలో గతేడాది 5,710 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఈ ఏడాది వానాకాలం వరి సాగుకు అనుకులంగా వర్షాలు కురియడంతో అధిక శాతం మంది రైతులు వరి సాగు పట్ల మక్కువ చూపారు. మండలంలోని కామేపల్లి, మద్దులపల్లి, పండితాపురం, లింగాల, జాస్తిపల్లి, ఊట్కూర్, ముచ్చర్ల తదితర గ్రామాల్లో అధిక శాతం మంది రైతులు చెరువు, కుంటలు, బోరు బావులను ఆసరాగా చేసుకుని వరి సాగు చేపట్టారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి 6,197 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లో వరి బీపీటీ, 1010 రకం, ఆర్ఎన్ఆర్ రకాలకు చెందిన వరి పంటను సాగు చేశారు.

యంత్రాలకు గిరాకీ..

పల్లెల్లో వరి కోతలు మొదలైతే కూలీలతో పొలాలన్నీ సందడిగా మారేవి. కానీ ప్రస్తుత తరుణంలో యాంత్రీకరణ పెరిగి పొలాల్లో పని చేసే వారే కరువయ్యారు. వరి కోత యంత్రాల వాడకంతో కూలీల అవసరం లేకుండానే సులువుగా వరి కోయిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి హార్వెస్టర్లను తీసుకొచ్చి ఎకరం పొలం కోసేందుకు రూ.2,000 నుంచి రూ.2,400 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. ఎకరం గంటన్నర లోపే వరి పంట నూర్పిడి పూర్తి అవుతుందని అంటున్నారు.

తెగుళ్లు సోకినా..

వరి పంటకు సుడి దోమ, కాండం కుళ్లు తెగులు సోకినప్పటికీ రైతులు సకాలంలో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి నివారణ చర్యలు చేపట్టారు. దీంతో ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు పండే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో హార్వెస్టర్ల సాయంతో వరి కోతలు కోయిస్తున్నారు. ఈనేపథ్యాన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు పీఏసీఎస్ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యాన్ని సంబంధిత కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. వరికి మద్దతు ధర దక్కే విధంగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో అన్నదాతలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిరీక్షణ తప్పింది..



మండలంలో 6 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేయగా.. ప్రస్తుతం రైతులు వరి కోతలు ముమ్మరం చేశారు. కూలీలతో పనిలేకుండా హార్వెస్టర్ల ద్వారా పంట నూర్పిడి చేయిస్తున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుంది.

– యలమద్ది అప్పారావు, కొండాయిగూడెం రైతు బంధు గ్రామ అధ్యక్షుడు, పండితాపురం

పదెకరాల్లో సాగు చేశా..



పదెకరాల్లో వరి సాగు చేశాం. వర్షాలు సకాలంలో కురవడంతో వరి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పంట పొట్ట దశలో ఉన్నప్పుడు తెగుళ్ల బెడద రావడంతో వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు నివారణ చర్యలు చేపట్టడంతో ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– బొగ్గారపు అశోక్, పండితాపురం, రైతు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం..



వరి కోతలు ప్రారంభంకావడంతో ముందస్తుగానే కామేపల్లి, లింగాల, కొండాయిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. క్వింటా ఏ గ్రేడ్ రకం ధర రూ.2,203, సాధారణ రకం రూ.2,183 చొప్పున కొంటున్నాం. నాణ్యత ప్రమాణాలు పాటించి విక్రయించుకోవచ్చు.

– భూక్యా తారాదేవి, ఏఓ కామేపల్లి

పీహెచ్‌సీలో ఫ్రిజ్ పనిచేయట్లే..

- వ్యాక్సిన్లు అందుబాటులో లేక ఏఎన్ఎంల అవస్థలు
- ప్రతీ బుధ, గురువారాల్లో ఇవ్వాల్సిన వైనం
- గత్యంతరం లేక ఖమ్మం నుంచి తీసుకొస్తున్న సిబ్బంది
- పట్టించుకోని వైద్యాధికారులు


పీహెచ్‌సీలో పనిచేయని ఫ్రిజ్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్లు నిల్వ చేసే ఫ్రిజ్ గత 25 రోజులుగా పనిచేయడం లేదు. ఏఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ బుధ, శని వారాల్లో గర్భిణులు, శిశువులకు వ్యాక్సిన్లు ఇవ్వాల్సి ఉండగా.. ఏఎన్ఎంలు ఖమ్మం వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాక్సిన్లు వేసేందుకు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా.. వైద్యాధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఖమ్మం నుంచి వ్యాక్సిన్లు..

పీహెచ్‌సీలో హెచ్ఈఓ, హెల్త్ సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలకు వ్యాక్సిన్లు అందించగా.. వారు ఆయా హెల్త్ సబ్‌సెంటర్లకు వెళ్లి సంబంధీకులకు అందిస్తారు. ఈనేపథ్యాన ఫ్రిజ్ పనిచేయకపోవడంతో ఖమ్మం వెళ్లి వ్యాక్సిన్ తెచ్చుకోవాలని ఏఎన్ఎంలను వైద్యాధికారులు ఆదేశించడంతో వారు అక్కడ నుంచి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యాక్సిన్ ఏమైనా కెమికల్ రియాక్షన్ జరిగే అవకాశం లేకపోలేదు. ఇటీవల మండలంలోని తిమ్మక్కపేటలో వ్యాక్సిన్ వేసిన ఓ శిశువు మృతి చెందగా.. ఈ ఘటనపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విచారణ జరిపి ఆస్పత్రిలో ఫ్రిజ్ పనిచేయని విషయం తెలుసుకున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి ఫ్రిజ్ రిపేర్ చేయించి వ్యాక్సిన్‌ను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ ఘటనపై డీఐఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ తీయలేదు. దీంతో పీహెచ్‌సీ వైద్యుడు రామారావును వివరణ కోరగా.. ఫ్రిజ్ పనిచేయని విషయాన్ని జిల్లా అధికారులకు తెలిపినట్లు చెప్పారు. ఇటీవల శిశువు మరణం వ్యాక్సిన్ వలన జరగలేదన్నారు.

మంత్రి పొంగులేటికి పలువురి శుభాకాంక్షలు


నేలకొండపల్లి: శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు


తిరుమలాయపాలెం: శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శివరామకృష్ణ

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలోని తన చాంబర్‌లో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌లో పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ మంగీలాల్, రైతు సమన్వయ సమితి మండల మాజీ కన్వీనర్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, గోళ్ల లింగయ్య, ఉప్పునూతల నాగేశ్వరరావు, ఓర వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సరిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్, వెన్నపూసల సీతారాములు, కోడాలి గోవిందరావు, మైశా శంకర్, బచ్చలకూరి నాగరాజు, పెద్దపాక సైదులు, మల్లెబోయిన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అదే విధంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లోకి మారిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బందోబస్తు నడుమ సోషల్ ఆడిట్..


రేగులచలకలో కొనసాగుతున్న గ్రామ సభ

రఘునాథపాలెం: మండలంలో గడిచిన మూడేళ్లలో ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీల వారీగా సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు చేసిన వివరాలను గ్రామ సభలు ద్వారా వెల్లడిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 20 పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి కాగా.. గురువారం 15 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ నేపథ్యాన రేగులచలక పంచాయతీలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామసభలో అర్హత ఉన్న వారికి పనులు కల్పించలేదని, పనులకు రాని వారి పేరుతో మస్టర్లు వేసి డబ్బులు డ్రా చేశారని గ్రామ కార్యదర్శి తీరుపై కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసుల బందోబస్తు నడుమ సభ కొనసాగించాల్సి వచ్చింది. 30 మందిపైగా ఇంకుడు గుంతలు తవ్వకాలు చేసినా బిల్లులు రాలేదని చెప్పడంతో ఏపీఓ పద్మయ్యనాయుడు ఐదు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానన్నారు. చెరువుకొమ్ముతండాలో సైతం ఇంకుడు గుంతల బిల్లులపైనే వివాదం చోటు చేసుకుంది. చాలా పంచాయతీల్లో పనులు చేసినా ఇంకా బిల్లులు రాలేదని, పనికి తగిన కూలీ చెల్లించలేదని, 80 శాతం మేరకు హరితహారంలో మొక్కలు సంరక్షణ ఉందని గుర్తించినట్లు సోషల్ ఆడిట్ బృందం సభలో వివరించారు. మండలంలో గత మూడేళ్లలో సుమారుగా రూ.13 కోట్ల విలువైన 1,300 రకాలకు పైనా పనులు చేసినట్లు అధికారిక లెక్కలు ఉన్నాయి. వాటన్నింటిపై పంచాయతీల వారీగా సోషల్ ఆడిట్ సాగుతుంది. శుక్రవారం మిగిలిన ఐదుపంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు.

తెలుగు మహాసభల కార్యదర్శిగా లెనిన్ శ్రీనివాస్


లెనిన్ శ్రీనివాస్

ఖమ్మంగాంధీచౌక్: రెండో ప్రపంచ తెలుగు మహాసభలకు తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జిల్లాకు చెందిన ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు మహాసభల నిర్వాహకుల నుంచి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యాన జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమండ్రిలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్న నేపథ్యాన శ్రీనివాస్ పదవిని కట్టబెట్టారు. కార్యక్రమ నిర్వాహకులు ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రతినిధి, తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్న గజల్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు లెనిన్ శ్రీనివాస్ మహాసభల ప్రచార కార్యదర్శి బాధ్యతలను స్వీకరించారు. ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం గ్రామంలో తపాలా చిరుద్యోగిగా పనిచేస్తున్న లెనిన్ శ్రీనివాస్‌కు మహాసభల తెలంగాణ ప్రచార కార్యదర్శి అవకాశం లభించటం పట్ల పలువురు కవులు అభినందిస్తున్నారు. తెలుగు భాషపై మక్కువతో తనకు అప్పగించిన ఈ బాధ్యతల విజయవంతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

‘రెజొనెన్స్’లో అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైం నేరాలపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం సీఐ నర్సింహారావు మాట్లాడుతూ.. పిల్లలకు ఇంటర్‌నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక భద్రతపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమైనా సమస్య వచ్చినప్పుడు 1930 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇటువంటి మోసాల బారిన పడకుండా సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ శాంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ మృతి

కామేపల్లి: రామకృష్ణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీవెల రామచంద్రయ్య(86) గురువారం మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు బలమైన గాయం కావడంతో ఖమ్మంకు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. రామచంద్రయ్య కామేపల్లి మాజీ సర్పంచ్‌గా పనిచేశాడు. కాగా,రామచంద్రయ్య మృతదేహాన్ని టీపీసీసీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ జర్పల రామారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

పశు వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, గోపాలమిత్ర ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 31 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడంతో పాటు 38 లేగ దూడలకు నట్టల మందును తాగించారు. 25 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి టి.సంజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించి దాణా ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంబాయి, గోపామిత్ర సూపర్‌వైజర్ శకంరయ్య, గోపాలమిత్రలు వి.నరేశ్, తాజ్‌పాషా, జిల్లపల్లి పాండు రంగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో యువతే కీలకం

ఖమ్మం సహకారనగర్: మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత భాగస్వాములు కావాలని టూ టౌన్ సీఐ కుమారస్వామి అన్నారు. గురువారం స్థానిక కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి యువత గంజాయి, నికోటిన్, హెరైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. నగరస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విద్యాసంస్థలనే లక్ష్యంగా చేసుకొని కొందరు దీనిని వ్యాపారంగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతీ విద్యార్థి మాదకద్రవ్యాలు వాడకం వలన కలిగే అనర్థాలపై ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది సీఐని శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగాపురంతండాలో డీఎల్‌పీఓ విచారణ


విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ పుల్లారావు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా పంచాయతీపై వచ్చిన వివిధ అవినీతి ఆరోపణలపై గ్రామస్తుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) కె.పుల్లారావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారులు, పాలకవర్గాన్ని విచారించిఇరువర్గాల నుంచి రిపోర్టును స్వీకరించారు. పంచాయతీలో ప్రధానంగా రహదారికి తీర్మానం చేసిన చోట కాకుండా ఇష్టానుసారంగా వేశారని, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకుండా బిల్లులు డ్రా చేశారని, వేసిన రహదారికే మరోమారు బిల్లులు పెట్టారని వివిధ ఆరోపణలు చేస్తూ గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. పంచాయతీకి సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈనేపథ్యాన ఇరువర్గాల నుంచి సేకరించిన నివేదికను డీపీఓకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, సర్పంచ్ భూక్యా సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గోపెమ్మ, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కామేపల్లి: మండల పరిధిలోని పండితాపురం, తాళ్లగూడెం గ్రామాల్లో అయ్యప్ప మాలధారుల ఇరుముడి గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయాల్లో గురుస్వామి ధనియాకుల మాధవరావు, పిప్పల శ్రీను ఆధ్వర్యాన ఇరుముడి కట్టి శబరిమలై బయలుదేరారు.

బియ్యం వితరణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కరుణగిరి జ్యోతి నివాస్ అంధ, మూగ పాఠశాల విద్యార్థులకు గురువారం శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన 2.50 క్వింటాళ్ల బియ్యంతో పాటు స్వీట్లు, బిస్కెట్లు అందజేశారు. పాలేరు శాసన సభ స్థానం నుంచి విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సభ్యులు రాయపూడి వెంకటేశ్వరరావు, జంగిలి రమణ, దేవరశెట్టి రామారావు, కొప్పుల కోటేశ్వరరావు, సూరినేటి మల్లేశం, పులిపాటి సంపత్, బజ్జూరి రమణారెడ్డి, సమారపు సుధీర్‌కుమార్, పాఠశాల హెచ్ఎం సోఫియా, ఉపాధ్యాయులు, సిస్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యుడు ఏపూరి నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో అందించిన రూ.10వేల విలువైన భోజన ప్లేట్లను గురువారం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్లేట్లు అందించడం అభినందనీయమన్నారు. ఈమేరకు హెచ్ఎంలు నారాయణరావు, సర్వర్‌మియాలు ప్లేట్లు వితరణ చేసిన నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ఝాన్సీ రాణి, పద్మ, మల్లికార్జున్, రమేష్, న్ .రమాదేవి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన పేద ప్రజలకు సంచార ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు తెలిపారు. గురువారం ఖమ్మంలోని చర్చి కాంపౌండ్‌లో ఉచిత వైద్య సేవలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చంద్రమోహన్ ఆదేశాల మేరకు ఖమ్మంతో పాటు కామేపల్లి మండలం పింజరమడుగులో సంచార ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందినట్లు తెలిపారు. డాక్టర్ హరినాథబాబు, నర్సు సింధుప్రియ, సంస్థ సభ్యులు సాధినేని జనార్దన్‌రావు, సూర్యప్రకాశరావు, ఎండీ గౌస్, సాయికుమార్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

దళిత స్పీకర్ నియామకంపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికచేయడంపై బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్ లింగాల రవికుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్ ఎంపికకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నగర టూ వీలర్ మెకానిక్ సోమవరపు రాముకు టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించినట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు తెలిపారు. ఈనెల 3వ తేదీన రాముకు రోడ్డు ప్రమాదం జరుగగా.. విషయం తెలుసుకున్న అసోసియేషన్ బాధ్యులు బాధిత కుటుంబానికి రూ.10 వేల చెక్కు అందించినట్లు తెలిపారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉంటే ఆపద సమయాన యూనియన్ ఆదుకుంటుందన్నారు. ఈనేపథ్యాన తెలంగాణ ప్రభుత్వం మెకానిక్ సోదరులందరిని అసంఘటిత కార్మికుల కింద గుర్తించి బీమా కల్పించాలని జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అప్పారావు, శ్రీను, మురళి, రమేశ్, అన్వర్, బ్రహ్మం, లాలయ్య, శేషు, సుభాని, వెంకట్, హరీశ్, కృష్ణ, పద్మారావు, చారి తదితరులు పాల్గొన్నారు.

జాంబవ వారసుల గ్రూపు ఆధ్వర్యాన విద్యార్థినికి..


ఆర్థిక సాయం అందిస్తున్న జాంబవ గ్రూపు సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: కామేపల్లి మండలం అడవిమద్దులపల్లికి చెందిన మాదిగ సామాజిక ఉద్యమకారుడు మందుల ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని పెద్దకుమార్తె మాధురికి చదువు నిమిత్తం జాంబవ వారసుల గ్రూపు ఆధ్వర్యాన గురువారం ఆర్థిక సాయం అందజేసింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో గల ఎస్‌జీటీ కళాశాలలో చదువుతున్న ఆమెకు ఫీజు నిమిత్తం రూ.28వేలను దళితరత్న గద్దల చంద్రయ్య, మడుపల్లి బాబుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పలిమల రమేశ్‌బాబు, కోవూరి సుభాశ్, పేరెల్లి శ్రీను, మరికంటి కన్నారావు, కేదాస్‌కృష్ణ, ఆరెంపుల్ల అంబేడ్కర్, కిరణ్, ఉపేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.